# అంతులేని అన్వేషణ

సతీశ్‌బాబు




"సమయం ఉదయం పదిగంటలు–"

దర్శిగుంటపేటనుండి, సీతారాంపురంవైపు ఆర్. టి సి. బస్సు శరవేగంతో దూసుకుపోతూంది గాలిలో.

అప్పుడే ఎస్.ఆర్. పూర్తిచేసుకున్న కండక్టరు ఒక్కసారి వెనుకవైపు తిరిగి జనసమూహాన్ని లెక్కించి, ఎస్. ఆర్. టాలి అయిందన్న తృప్తితో గట్టిగా శ్వాసపీల్చి సిగరెట్టు ముట్టించాడు.

వాతావరణం చాల ప్రశాంతంగా

వుంది. రోడ్కు ఇరువైపుల, గగన మండలాన్ని అంటుకున్నట్లున్న పర్వత శ్రేణి, దట్టమైన వృక్షజాలంతో ఎంతో అందంగా వున్నాయి.

ఆ పర్వతాలమధ్య త్రాచుపాములా మెలికలు తిరిగివున్న ఘాట్ రోడ్ కు మధ్య భాగంలో అక్కడక్కడ దట్టమైన గుట్టల సమూహం, వాటికి అతిదగ్గరలో చిన్నచిన్నపూరి గుడిసెలతో నిండివున్న ప్రజల నివాసపు పల్లెలు—

పచ్చని గడ్డితోనూ, పంటపొలాలతోనూ ఎంతో శోభాయమానంగా వున్న ఆ దృశ్యం చూపరులకు అచ్చెరువు గొల్పుతూంది.

దట్టమైన చెట్లతో మేళవించివున్న ఆ ప్రాంతంనుండి రోడ్డు వైపునకు వచ్చు చల్లనైనగాలికి, పొందే అనుభూతిలో ఒకరి నొకరు మైమరచి ఒడలు మరచి వున్నారు ప్రయాణీకులు.

ఆ పరిస్థితిలో—బస్సు ఉన్నపాటున ఒక్కసారి ఆగిపోయింది, డ్రైవరు వేసిన సడన్ బ్రేక్ కు. బస్సులోని ప్రయాణికులతోపాటు, ఎక్కడో ఊహా ప్రపంచంలోవున్న కండక్టర్ మనస్సు స్వాధీనంలోకి రాకతప్పలేదు దాంతో—

యాంత్రికంగా పరికించిన కండక్టర్ వెంటనే తలుపు తెరిచాడు.

తలుపుకు అతి దగ్గరలో ఒక వయస్సులోవున్న స్త్రీ ఒక పాపతో నిలువబడివుంది.

ప్రపంచంలోని అందాన్ని ఒక్కసారి మేళవించి ఒక మూసలోపోసి ఆ అపరంజిబొమ్మను తయారుచేసినట్లుందా సృష్టికర్త.

అంతటి అపూర్వసుందరి ఒంటరిగా ఇక్కడెందుకుందోనన్న సందేహంతో తొంగిచూసే లోపల కండక్టరును నఖశిఖ పర్యంతం పరికించి తలదించుకుంది—

ఆమె ముఖంలోని భావం అర్థంకాలేదు కాని, కనుదోయినుండి మాత్రం జాలుగా గారే కన్నీరు అక్కడివారిని ఆశ్చర్య చకితులతోపాటు బాధామయులను జేసాయి—

"బస్సు ఎందుకాపావు?" అన్నాడు డ్రైవరును చూస్తూ కండక్టరు.

"ఆమె చేయి ఎత్తింది!" అన్నాడు డ్రైవరు.

"బస్సు ఎక్కనిదానివి, ఎందుకాపినట్లు?—" అన్నాడు కండక్టరు ఆమె వైపు తిరిగి.

కాని ఆమెనుండి ఎలాంటి సమాధానం రాలేదు. పైగా బస్సును వెళ్ళిపొమ్మన్నట్లు చేత్తో సైగజేసింది—

ఒక్కసారిగా డ్రైవరువైపు చూసాడు కండక్టరు. డ్రైవరు అర్థంగాక తల గోక్కున్నాడు.

"రైట్"అన్నాడు కండక్టరు. బస్సు బయలుదేరింది.

కాని అందరి దృష్టిలోనూ ఆ స్త్రీ

రూపం మూర్త్రీభవించిపోయింది కొన్ని క్షణాలు—

అయినా ఆమె కన్నీటికి ఆలవాలమైన వెనుకటిగాథ, ఎవ్వరికి తెలుసు ?!—

ఎలా తెలుసు ?!

కొన్ని రోజులకు ముందు ఒకరోజు-సాయంత్రం నాలుగుగంటల సమయంలో సీతారాంపురంనుండి తిరిగివస్తూవున్న ఆర్.టి.సి. బస్సు ప్యాగ్ బెల్టు తెగిపోయి ఒకవిధమైన ధ్వనితో వున్నపాటున ఆగిపోయింది.

బస్సులో ప్రశాంతంగావున్న ప్రయాణికులలో మెల్లగా కలకలం బయలుదేరింది.

డ్రైవరు క్రిందికిదిగి బస్సునుపరీక్షించి "ప్యాగ్ బెల్టు తెగిపోయింది బస్సు నడవదు" అన్నాడు.

అంతే. పెద్ద కలకల ధ్వనులతో బస్సులోని వారందరు క్రిందకు దిగారు కంగారుగా—

"ఇప్పుడేం చెయ్యడం?—"అన్నాడు కండక్టరు.

"రిలీఫ్ కోరడమే—"అన్నాడు డ్రైవరు. "అయితే ఈ ప్రయాణికుల సంగతి ఎలా?" మన బస్సులేవైనా వున్న వోలేవో ?! అన్నట్లు ఆలోచనలో పడ్డాడు కండక్టర్.

దూరంగా ఎదురుగావచ్చే లారీనిచూస్తూ "నేను ఈ లారీని పట్టుకొని డిపోకు పోయి రిలీఫ్ కోరతాను—నువ్వు ఏ విధంగానైన మన బళ్ళలో వారిని ఎక్కించు" అంటూ తనను సమీపించిన లారీని పట్టుకొని వెళ్ళిపోయాడు డ్రైవరు.

"ఏమిటి కండక్టరుగారూ మా పరిస్థితి?"అని ఒకరు, ఇప్పుడెలా మేము యిల్లు జేరడం?—అని మరొకరు-అయితే మా డబ్బు తిరిగి యివ్వండి?! — అని ఇంకొకరు. ఎప్పుడైనా ఆర్. టి. సి. వాళ్ళు తిరిగి డబ్బు యిచ్చారా ఇప్పుడు యివ్వటానికి ? అని వారిలో యింకొకరు —యిలా ఎవ్వరికి వారు వారి వారి యొక్క అభిప్రాయాలు ఏకరువు పెడుతున్నారు.

అనేక కంఠాల బారినుండి అనేక విధాల మాట్లాడే వారియొక్క మాటల మధ్య నుండి వారిని క్రాసుజేస్తూ పోయే ఆర్.టి.సి. బస్సులను రెంటిని ఆపి ఎక్కించి పంపేసరికి సరిగ్గా సాయంత్రం ౭-౩౦ గంటలైంది.

కండక్టరు ఒక్కసారిగా చేతి గడియారం చూసుకొని విస్తుపోతూ సిగరెట్టు ముట్టించాడు ఆ పరిసరాలను పరికిస్తూ.

అప్పడప్పడే మసగచీకట్లో కంటికి మసకగా కనుపించే కొంత దూరంలో వున్న పల్లె,దానిచుట్టూ అలముకొనివున్న పర్వతశ్రేణితో చిత్రపటంలా మెరిసింది కండక్టరు మనస్సులో.

సంతృప్తిగా ఆ దృశ్యాన్ని తిలకించిన

కండక్టరు మరొక సిగరెట్టు కాల్చి మెల్లగా బస్సులో కూర్చున్నాడు.

ఓ అరగంట దాటాక 'బా బూ !' అన్న పిలుపుతోపాటు ఓ ముసలాయన బస్సు తలుపుదీస్తూ అన్యమనస్కంగా వున్న కండక్టరు మ న స్సు క ల త పెట్టాడు—

"ఆ! ఏంటితాతా?!–" అన్నాడు కండక్టరు. "బాబుగారూ బస్సు చెడి పోయిందా?"–అన్నాడు ముసలాయన.

"అవును".

"బాగా చీకటి పడిపోయింది. ఇంత రాత్రిలో ఇక్కడెక్కడ ఒక్కడివే వుండగలవు ?!"—

"తప్పేదేముంది. మా ఉద్యోగ ధర్మం ?"

"బాబూ భోంచేసి ఏవేళైందో"– మా యింటికి రా బాబూ నాలుగు మెతుకులు ఎంగిలి పడుదువుగాని.

"ఎందుకులే తాతా ?!"

మీరు తినేది పెట్టలేకపోయినా,— మా యింటిలో వున్న దేదో పెట్టగలం బాబూ–అనుమానించకుండా రా బాబూ" అన్నాడు ముసలాయన.

కండక్టరుకు ఆకలిగానే వుంది. పైగా ఆ పరిసరాలలో తిండి దొరికే అవకాశం లేదు–అందువల్లే "సరే తాతా! "అంటూ ట్రే బాక్సు తీసుకొని ముసలాయనతో పాటు నడకలో లీనమయ్యాడు.

ముసలాయన ఓ యింటి దగ్గర ఆగాడు. యిల్లు మాత్రం పూరిల్లు. అయినా చక్కగా అధునాతనంగా వుంది. యింటిముందు మాత్రం మంచం వాల్చి వుంది.

బయట గుమ్మం దగ్గర ఒక బకెట్ చెంబు, నీళ్ళతో వున్నాయి.

"బాబూ ? కాళ్ళు కడుక్కోండి ?!" అన్నాడు ముసలాయన.

కండక్టరు ట్రే బాక్సు మంచంపై పెట్టి మెల్లగా కాళ్లు కడుక్కున్నాడు.

"లోపలకు రా బాబూ"—అంటూ యింటిలోకి దారితీసాడు ముసలాయన.

యింటి ఆవల ద్వారం దగ్గర ఒక అమ్మాయి నిలబడివుంది సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మిలా–యింటిలో ఒక ప్రక్క ఆకలి దీర్చేందుకు కావలసిన పదార్థాలన్నీ ఏర్పరచివున్నాయి — కండక్టరు చూపు మాత్రం ఆమెనుండి తప్పుకోలేదు—

"కూర్చోండి బా బూ – " అ న్న ముసలాయన మాటలకు త్రుల్లిపడ్డాడు కండక్టరు. తన స్థితికి తానే సిగ్గుపడ్డాడు, ఆమె అందాన్ని మనస్సులో మనన చేసుకుంటూ—

"బాబూ"-కూర్చొని తిను అమ్మాయి యిక్కడే వుంటుంది. కావలసినవి అడిగి పెట్టించుకోండి–ఆమె అతిధులను అడిగి పెట్టలేని దురదృష్టవంతురాలు–"

"అంటే ?—"

"ఆ అమ్మాయి నా కూతురు బిడ్డ.

పేరు లక్ష్మి పుట్టకతోనే తల్లిదండ్రులతో పాటు మాటకూడా లేకుండా జేసాడా భగవంతుడు."

"ఆఁ!—అయితే ఆ అమ్మాయి మూగదా ?!—"

"అవును. మూగదే" అన్నాడు.

ఇంతటి రూపవతిని మూగదానిగా జేసాడా దేవుడు—నిజంగా దేవుడు రాయే?-లేకపోతే ఏమిటీ విచిత్రం ?!—

చిత్రమైన రూపలావణ్యాలు యిచ్చి, గొంతుక తానే తీసుకున్నాడేమిటీ?–అన్న పిచ్చి పిచ్చి ఆలోచనలనుండి తేరుకొని ఎప్పటికో అన్నాడు "తాతా ఈ సుందర మైన అమ్మాయి మూగదా ?"

"అవును"

"పాపం ఈమె పుట్టుకకు పరమార్థ మేమిటో?"

"ఏమోలే బాబూ ! ముందు నువ్వు భోజనం కానీయ్" అన్నాడు ముసలాయన.

"ఏమిటీ చిత్రం ?!"– భగవంతుని దృష్టిలో ఈలాంటి వింతలు ఎందుకు జరుగుతాయో ?!–దేవతలను తలదన్నే అపూర్వమైన ఆమె రూపం. పాపం తన దీనావస్థను చెప్పుకోలేని మూగమనస్సు.

"సృష్టి నొసగినది దేవుడైన మరి నాశం నేల సృజించే-కనుల నొసగినది దేవుడైనా మరి అంధులనేల సృజించే-"అన్న బాట సారి లోని పాట గుర్తుకొచ్చింది

యాంత్రికంగా భోజనం ముగించి బయటకొచ్చి కూర్చున్నాడు—

కాని మనస్సులోని ఆలోచనా తరంగాలు మాత్రం లక్ష్మిని గురించే చోటుచేసుకున్నాయి.

అనుకోకుండా ఆమె వాకిట్లో కొచ్చి ఎదురుగా నిలువబడింది.

శిలాప్రతిమలా నిలబడియున్న లక్ష్మిని ఆమూలాగ్రాంతం పరికించి మెల్లగా బయలుదేరాడు కండక్టరు.

"ఎక్కడకు బాబూ?!"—అన్నాడు ముసలాయన.

"బస్సు దగ్గరకు తాతా." అన్నాడు కండక్టరు.

"బస్సు దగ్గరకా?! ఎందుకు ?"— ముసలాయన ప్రశ్న.

బస్సు దగ్గర మనిషిలేకుండా వుండ కూడదు తాతా". కండక్టరు తిరుగు సమాధానం.

ఇంత రాత్రిలో నువ్వు అక్కడ పడుకుంటావా?! ఇక్కడే పడుకో బాబూ. అవసరమనుకుంటే బస్సుదగ్గర నేను పడుకుంటాను. అన్నాడు ముసలాయన.

"వద్దులే తాతా–" అంటూ నాలుగు అడుగులు వేసాడు కండక్టరు.

"బాబూ?!—నా మాట విను. పెద్ద వాణ్ణి, ఒంటరిగా అక్కడ పడుకోవడం అంత మంచిదికాదు. అన్నాడు ముసలాయన."

ముసలాయన అన్న మాటలకు కండక్టరు దృష్టి ముందు క్యాషుబ్యాగ్ మీద పడింది. కొన్ని క్షణాలు ఆ సంచిని పరికించి "సరే తాతా?!—నువ్వు వెళ్ళి

బస్సుదగ్గరే పడుకో-- ఆ\! ఎంత రాత్రికైనా మా మనుష్యులు అక్కడకు వస్తారు. వాళ్ళు అక్కడకు వచ్చేక నాకు మాత్రం కబురుపెట్టు-" అన్నాడు.

"అలాగే బాబూ—" అంటూ ముసలాయన నాలుగడుగులు వేసి— "అమ్మా లక్ష్మి—మంచంవాల్చి పడక వేయి" అంటూ వెళ్ళిపోయాడు.

అంతవరకు చలనరహితమై నిలబడ్డ ఆమెలో చలనం ఏర్పడింది. లోపలకుపోయి మంచం,దిండు, దుప్పటి తెచ్చి ఆరుబయట పడకవేసింది కండక్టరుకు.

సంకోచం లేకుండా చేతిలోని క్యాష్ బ్యాగ్ ట్రే బాక్స్ ఆమె కందించాడు, "లోపలపెట్టు" అంటూ. ఆమె తనచేతి కిచ్చిన రెండు వస్తువులు తీసుకొనిపోయి లోపల దాచింది.

కండక్టరు మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూవెళ్ళి మంచంపై మేను వాల్చాడు-కాని, చల్లనిగాలి, మనస్సును పదేపదే పరవశింపజేసే పండువెన్నెల అతని మనస్సును ఆలోచనా నిమగ్నుని చేసాయి. దాంతో చూపు మెల్లగా పరిసరాలవైపు మరలింది.

అంతా కలిపి అక్కడ సుమారు ఇరవై యిల్లుకూడా లేవు. కాని ఆ పల్లె చుట్టూ ఎంతో అందంగావున్న కొండల సముదాయం, కొండచరియలలోనుండి ఆ పల్లెకు అతిదగ్గరలో ప్రవహించే నదీజల తరంగాలతోపాటు, ఆకాశంలో మెరిసే నక్షత్రమండలమూ, కండక్టరు మనస్సును ఏదో మరో మండలానికి తీసుకొనిపోయాయి కొన్నిక్షణాలు—

"అబ్బ!!— ఎంత సుందరమైన వాతావరణం?!—మనస్సు ఆనంద డోలికలలో ఓలలాడించే అనుభూతిని కలిగిస్తూంది. ఆహా\! దీన్ని ఆవ్యాజించే అదృష్టం పల్లెవాసులదేకదా !?"—

అతని మనస్సు తల్లడిల్లిపోయింది. అంతలోనే ఘల్లుఘల్లుమనే కాలిఅందియల చప్పుడు మనస్సును వికలంచేసి వాటివైపు దృష్టిమల్లేట్లు చేసాయి.

అంతే?!-ఇక్కడ అంటే మరికొంత దూరంలో నిలువబడ్డ లక్ష్మి రూపం అతనిలో చోటుచేసుకుంది.-— అరెరే !! లక్ష్మి యింకా నిద్రపోలేదా?!—తనలో అనుకున్నాడు. అయినా ఎలా పోగలదు పాపం— ఆమె భవిష్యత్తుని అన్యులు ఆలోచిస్తేనే బాధగావుంది. మరి ఆమె ఆలోచించుకొంటే ఎలా వుంటుందో ?!- అర్థం తెలుసుకుంటే ఆమె భరింపగలదా?!—భరించలేదు.

ఎవరైనా ధైర్యం చేసుకొని ఆమెను భార్యగా పొందేందుకు ముందుకు రాగలరా ?! —ఎవ్వరు మాత్రం రాగలరు ?! — సాహసించి ముందుకు అన్న అనంతమైన ఊహలవాహినిలో మెరపులా మెరిసింది ఒక చక్కని యోచన—"తాను మాత్రం ఆమెను

భార్యగా ఎందుకు పొందకూడదు" అన్నట్లుగా.

దేవకాంతలను తలదన్నే అందం, అంతకుమించిన అణకువ, అన్నిటినీ మించిన ఆమె మూగవోయిన మనస్సు!—అంతే అతని మనస్సులో అదే ఆలోచన స్థిరమై పరిసరాలను వెలికి నెట్టివేసింది.

—కొన్ని క్షణాల అనంతరం—

"లక్ష్మి!?—" అని పిలిచాడు కండక్టరు. ఎంతో ఆత్రుతగావచ్చి నిలువబడిపోయింది, అతని ఎదురుగా-కన్నార్పకుండా ఆమె అందాన్ని అతని మనస్సులో రూపకల్పన జేసుకుంటూవుంటే ఆమె ముఖం చెప్పరాని సిగ్గుతో వాడిపోయింది.

" నిన్ను నేను పెండ్లిచేసుకుంటాను. నీకు ఇష్టమేనా?!—" అన్నాడు కండక్టరు.

ఆ మాటలకు ఆమె గుండెలలో ఎన్నో వత్సరాలుగా గూడుకట్టుకున్న నిరాశ, నిస్పృహలు ఒక్కసారిగా మా కింక నెలవులేదు అన్నట్లుగా అనుకున్నాయి ముక్తకంఠంతో.

ఏదో తెలియని భయం ఆమెను ఆవహించింది. శరీరమంతా ఆమెకు తెలియకుండానే వణుకు ప్రారంభమైంది.

తన చేతులతో ముఖాన్ని కప్పుకొని తుర్రున లోపలకు పోయింది లేడిపిల్లలా.

వెంటనే ఆమెను అనుసరించాడు కండక్టరు లోపలకు—

తన చేతులతో ఆమెను తనవైపునకు త్రిప్పుకొని "ఏం లక్ష్మి ?!—సమాధానం చెప్పవేం?!—నేనంటే ఇష్టమేనా ?!—" అన్నాడు.

ఆమె నోటినుండి ఎలాంటి మాటా రాలేదు.కాని ఎన్నోభావాలతో ఆమెకళ్ళు, హృదయంలోని ఆరాటం, ఆవేదన, ఆందోళన, సంతోషాలను కొన్నిక్షణాలు వ్యక్తం చేసాయి.

ఆమె మనోభావాన్ని ఆకళింపుచేసుకున్న కండక్టరు తన ఆలింగనంలో ఆమెను బంధితురాలుగా జేసుకున్నాడు.

కాని తనఅంతటి దురదృష్టవంతురాలికి, అంతటి అదృష్టాన్ని ఆపాదిస్తున్న ఆ స్వామిని తన కళ్ళతో తనివితీరా చూచి అమాంతం అతని పాదాలమీద వాలిపోయింది—

"లక్ష్మి !!— ఈ రోజునుండి నా మాటే నీ మాట. నీకున్న మూగబాధను నేను తొలగిస్తాను—నిన్ను నా భార్యగా జేసుకొని నువ్వు ఊహించని ప్రపంచంలో నిన్ను సంచరించేట్లు చేస్తాను—" అన్నాడు.

అంతే అతని కౌగిలిలో చండులా వాలిపోయింది—కొన్ని క్షణాలలో వారిరువురి మధ్యలో మౌనం చోటు చేసుకుంది—కాని వారిరువురు ఏకమైన చూపులతో ఎక్కడెక్కడో దూరతీరాలలో చేరిపోయారు.

అలాంటి సమయంలో కొన్నిక్షణాల




అనంతరం — ఆ రాత్రిని ఏకధాటిగా ఏలే వెన్నెల. కలసిన చల్లగాలితో వారిని ఎన్నో జన్మల అనంతరం కలుసుకున్నామో అన్నట్లుగా చేస్తే వారియొక్క చిలిపిచేష్టలు వారి వారి శరీరాలలో ఏదో తెలియని చైతన్యాన్ని కలిగించాయి.

"లక్ష్మి !!—నిన్ను చూస్తున్నకొద్దీ నీ అందాన్ని అనుభవించాలని–మనస్సు ఎందుకో ముచ్చటపడుతూంది". అన్నాడు.

"నన్నా?!" అన్నట్లు తనవైపు చూసుకుంది లక్ష్మి కంగారుగా.

"అవును. అయినా ఒక్కసారి నా మనస్సులోని ముచ్చట తీర్చలేవా?!–" అన్నాడు.

కాని అందుకామె ఇష్టపడలేదు. కరెంట్ షాక్ తిన్నట్లుగా వెనుకడుగేసింది– పెండ్లి అయిన తర్వాతే నీ కోరిక తీరుతుంది !! అన్నట్లు సైగతో చెప్పింది లక్ష్మి.

"అమ్మబాబోయ్ !! — ఘ టి కు రాలవే... ?! అయినా వున్నపాటున పెండ్లి ఎలా ?—కాని దైవసాన్నిధ్యంలో పెండ్లిజేసుకుంటాను, ఇ ప్ప డు—ఆ తర్వాత మా పెద్దవారితో వచ్చి వారి సమక్షంలో ని న్ను నా దా న్ని గా జేసుకుంటాను. అందుకు స మ్మ త మేనా ?!—" అన్నాడు కండక్టరు.

"సరే !!—" అన్నట్లు లక్ష్మి తల వూపింది.

మరికొన్ని క్షణాలలో ఆ గ్రామానికి కొంతదూరంలో కొ ం డ మీ దు న్న శివాలయం దగ్గరకు చేరుకున్నారా జంట.

దైవంచుట్టూ ప్రదక్షిణం జేసాక ఆ జంట దైవం ఎదుట నిలువబడ్డారు— ఆతర్వాత "నింగి నేలా,కసులమిరిమిట్లు, గాలిపే ఆ పర్వతశ్రేణి సాక్షిగా శివుని సమక్షంలో ఇరువురు దండలు మార్చు కొని ఒక్కటైనారు.

"లక్ష్మి ?! — కనిపించే దై వ ం సాక్షిగా ని న్ను నా అ ర్ధా ం గి గా స్వీకరించాను. నేను జీవితాంతం నీ భారాన్ని మోస్తానని ప్ర మా ణ ం చేస్తున్నాను." అంటూ వరుడు వధువు చేతిలో చేయివేసి ప్రమాణం జేసాడు.

అంతే !!—లక్ష్మి మనస్సులో వేయి వెన్నెల రా త్రు లు ఒక్కసారిగా ఉదయించాయి.

ఆ ఒక్క రాత్రిలో వారిరువురు ఒక్కటై కోటిపున్నమినాటి రాత్రుల అనుభూతిని పొందారు.

వారి ఆనందానికి, అనుభూతులకు అంతుతెలియని కాలంలో వారిని కల్లోల పరచింది మ్రోగుతూన్న కారుహారన్ మోత.

మగత నిద్రలోవున్న భర్తను తట్టి లేపింది చేత్తో.

నిద్రనుండి లేస్తూనే కారుహారన్ మోత విని కంగారుగా పడకపైనుండి లేచాడు.

ప్రక్కను బ్రే బాక్స్, క్యాషుబ్యాగు తీసుకుంటూ "లక్ష్మి వెళ్తాను. మా వాళ్లు వచ్చినట్లుంది" అన్నాడు కండక్టరు.

లక్ష్మి అమాంతం భర్త కాళ్ళమీద పడిపోయింది. మెల్లగా ఆమెను లేవదీస్తూ "లక్ష్మి!భగవంతుని సాక్షిగా నీ కెలాంటి అన్యాయం చెయ్యను—రెండు మూడు రోజులలోనే మా పెద్దవారితో వచ్చి నిన్ను నా యింటికి తీసుకొనిపోతాను. ధైర్యంగావుండు" అంటూ బయలుదేరిన కండక్టరుకు కన్నీటితో వీడ్కోలు చెప్పింది లక్ష్మి—

కండక్టరు బస్సుదగ్గర కెళ్ళేసరికి, "ఎక్కడ కెళ్ళావు ?!—" అన్నాడు డ్రైవరు.

ఇక్కడ ఎంతకూ నిద్రపట్టలేదు— ఇంతలో పాపం ఈ ముసలాయన తన మంచం యిచ్చాడు నిద్రపొమ్మని—

కమ్మగా నిద్రపట్టింది రాత్రి—" అన్నాడు.

అంతకుముందే బస్సును బాగుచేయుట కుపక్రమించిన మెకానిక్స్ మరి కొన్ని నిమిషాలలోనే పనిపూర్తిజేసి "ఓ కె" అన్నారు.

"సరే, వస్తాం తాతా"—అంటూ మిగతావారితోపాటు బస్సులో ఎక్కాడు కండక్టరు కాని అతని మనస్సుమాత్రం నిండుగా తనలో లక్ష్మి రూపాన్ని నింపుకుంది.

మెల్లగా బయలుదేరి బస్సును వేగం ఎక్కువజేసాడు ఘాట్ రోడ్ చేరేసరికి.

అప్పుడే గగనమండలంలో ఎక్కడో వున్న చేరెడు మబ్బు జాలుగా వర్షంగా ప్రారంభమైంది—అది అంతై ఇంతై, దిక్కుదిశా తెలియని జడివానకు దారి తీసింది.

దారీతెన్నూ కనుపించని కారుచీకటిగా మారిన అలాంటి వర్షంలో ఎలాంటి ఆటంకాన్ని గూడా లెక్కచేయకుండా డ్రైవరు మాత్రం మార్గాన్వేషణలో నిమగ్నుడు కావటంలో బస్సుకు రోడ్డు స్లిప్ అయింది.

దాన్ని కంట్రోలు చేయబోయే స్థితిలో బస్సు రోడ్డు చివరికి వచ్చింది. రోడ్డుచివరనున్న బస్సును స్టడీచెయ్య బోయేసరికి కంట్రోలుతప్పి రోడ్డుక్రింది భాగంలోవున్న అఘాతమైన లోయలో పడిపోయింది బస్సు—

అంతే !!

భగవంతుడు తీరని అన్యాయమే చేసాడు లక్ష్మికి.

కన్యగా—వస్తాడు అన్న ఆతృతతో ఎన్నో ఆశలు పెంచుకొని చూసింది—రాలేదు. కొన్ని మాసాలకు ఆమె తల్లి కూడా అయింది.

అయినా రాలేదు!! రాలేదు! రాలేదు!! అన్న ఆశ ఆపేక్షలే కాని ఎందుకు రాలేదో అన్న ఆలోచనే ఆమెకు లేదు—రాదు కూడా !!

వచ్చేపోయే బస్సులను ఆపుతూ తన మనిషి రాలేదన్న నిరాశతో అలమటిస్తూ బ్రతకడం ఆమెకు పరిపాటై పోయింది నిత్యజీవితంలో—

అయినా ఆమె అంతులేని అన్వేషణకు అంతమెప్పుడో అర్థంకాదు—అర్థం లేదు"—

